హామీలు నెరవేర్చిన ప్రభుత్వం


కె.గలావల్లిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు


గలావల్లిలో సీసీ రోడ్ల నిర్మాణాలకు టెంకాయ కొట్టిన ఎమ్మెల్యే జోగారావు

• ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చారని, ఇంతవరకు ఇటువంటి హామీలను ఎవరూ ఇచ్చి నెరవేర్చలేదని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలం కె.గలావల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా వారు అందుకున్న పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన నాటినుంచి నెరవేర్చిన గొప్ప ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఎన్నింటిని నెరవేర్చారో ప్రజలు గుర్తించాలని కోరారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి తు.చ తప్పకుండా అమలు చేయడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే చెల్లిందన్నారు. ఇటువంటి సీఎంను ఇంతవరకు చూశారా? అని ప్రజలను ప్రశ్నించారు. ఇంటింటికి వెళ్లి వారికి గడిచిన కాలంలో వచ్చిన పథకాలను వివరించి ఇంకా అర్హత ఉండి రాని పథకాలు ఉంటే చెప్పాలని కోరారు. ఇన్ని పథకాలు అందిస్తూ, ప్రజలకు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీకాంత్, ఎంపీపీ నాగమణి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, కె.దాలినాయుడు, మాధవనాయుడు, వి.భజంగరావు, ఎస్.సర్వేశ్వరరావు, పి.సత్యనారాయణ, సుదర్శన్, ఎ.మురళి, జి.అక్కంనాయుడు, జి.వాసుదేవరావు, సూరపునాయుడు, మోహన్, పారినాయుడు, అప్పలనాయుడు, సర్పంచ్ కె.మోహనరావు, జి.సత్యంనాయుడు, జగన్, కె.గౌరునాయుడు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన

మండలంలోని గలావల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే జోగారావు టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేయాలని ప్రజలు కోరడంతో తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల కోరిక మేర బీసీ కాలనీ, చాకలివీధి, ప్రధానరహదారి నుంచి బంగారుతల్లి గుడివరకు, వడ్డపల్లి వీధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వాటిని తక్షణమే పూర్తిచేయించాలని అధికారులను కోరారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలకు సత్కారం


ఎంఈఓలను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

సీతానగరం: ప్రభుత్వం అమలు చేసిన నూతన విద్యావిధానంలో భాగంగా పాఠశాలల పర్యవేక్షణకు నియమించిన ఇద్దరు ఎంఈఓలను ఉపాధ్యాయ సంఘం నేతలు సోమవారం సత్కరించారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘం నాయకుడు పి సత్యనారాయణతో పాటు ఇతర ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ ఎంఈఓ -1 జి.సూరిదేముడు, ఎంఈఓ -2 మువ్వల వెంకటరమణ ప్రభుత్వం నియామకం మేరకు బాధ్యతలు చేపట్టారన్నారు. ఇంతవరకూ ఒకే ఎంఈఓ విధులు నిర్వహించినప్పటికీ ఎంఈఓ -2 వెంకటరమణ మండలంలోని వివిధ ఉన్నత పాఠశాల్లో హెచ్‌ఎంగా విధులు నిర్వహించారన్నారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమకు సహకారం అందించాలని, నాణ్యమైన విద్యనందించడానికి అవసరమైన వసతులు కల్పిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

నేత్ర వైద్యశిబిరం విజయవంతం


రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

సాలూరు: పట్టణంలోని డబ్బివీధి వేంకటేశ్వర కల్యాణ మంటపంలో సోమవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్యశాల, సత్యవరపు ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 95 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 45 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినట్లు నిర్వాహకులు తెలిపారు.

చినభోగిలిలో పారిశుద్ధ్య పనులు


సీసీ రోడ్లపై చెత్తకుప్పలను తొలగిస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని చినభోగిలి గ్రామంలో సర్పంచ్ కురమాన రాధ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి ఎం.మనోహర్ సోమవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి సర్పంచ్ కె.రాధ, పాలకవర్గ సభ్యులు ప్రాధాన్యం ఇచ్చిన మేరకు కాలువల్లో పేరుకు పోతున్న చెత్తను తొలగించడంతో పాటు వీధుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు చెప్పారు. వీధుల్లోని చెత్తకుప్పలను దూర ప్రాంతాలకు తరలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన


ఎస్.పెద్దవలసలో అవగాహన కల్పిస్తున్న సెక్రటరీ మహేష్

మక్కువ: మండలంలోని ఎస్.పెద్దవలస సచివాలయంలో జగనన్న సురక్ష పథకంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీలు మహేష్, రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ... వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందున్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. అలాగే ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాలు మంజూరు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకుడు పూడి తిరుపతిరావు పాల్గొన్నారు.

రీ సర్వే రాళ్లు వేసిన కూలీలకు బిల్లులు చెల్లించాలి

సీతానగరం: మండలంలోని బగ్గందొరవలసలో రీ సర్వే పూర్తయిన భూముల్లో రాళ్లు వేసిన కూలీలకు బిల్లు చెల్లించాలని సోమవారం తహసీల్దార్ ఎన్వీ రమణను కోరారు. ఈ మేరకు రీ సర్వే రాళ్లు వేసిన కూలీల జట్టు నాయకుడు సూర్యనారాయణ మాట్లాడుతూ పనిచేసి నెలరోజులైనా ఇంతవరకూ బిల్లులు చెల్లించనందున తహసీల్దార్ ఎన్వీరమణ దృష్టి తెచ్చామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన మరుక్షణమే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, ఆర్‌ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై ఎంఈఓకు ఫిర్యాదు

గరుగుబిల్లి: మండలంలోని సాంబన్నవలస పాఠశాల ఉపాధ్యాయుడిపై గ్రామానికి చెందిన కె.బలరాంనాయుడు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. పాఠశాలకు విద్యార్థులు రాకపోవడంతో తరగతి గది తలుపులు వేసుకుని సెల్‌ఫోన్ చూసుకుంటున్నారని, దీన్ని ప్రశ్నించిన తమపై దుర్భాషలాడుతూ వాగ్వాదానికి దిగుతున్నారని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సదరు ఉపాధ్యాయుడు తనపై కావాలనే బలరాంనాయుడు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, గతంలో కూడా ఇదే తరహాలో వేధింపులకు పాల్పడ్డారని అన్నారు. దీనిపై ఎంఈఓ ఎస్.నాగభూషణరావు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

భామిని: మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై యతిరాజుల అమ్మనరావు హెచ్చరించారు. బత్తిలి బస్టాండ్ సమీపంలో సోమవారం సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడిపేవారిపై అపరాద రుసుం విధించారు. మద్యం తాగి డ్రైవ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు కళాశాల సిబ్బంది సత్కారం


బలిజిపేట: ఉన్నత పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ నాగమణి


పార్వతీపురం టౌన్: విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది


సీతానగరం: విద్యార్థులు, పేరెంట్స్‌ను సత్కరిస్తున్న స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు

పార్వతీపురంటౌన్: ఇటీవల జరిగిన జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులను స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సభలో ప్రిన్సిపాల్ ఆకుల రాజు మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని మిగిలిన విద్యార్థులందరూ భవిష్యత్తులో రానున్న పబ్లిక్ పరీక్షలలో అత్యున్నత ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పురస్కారాలకు ఎంపికైన తాడంగి గణేష్, మెల్లక సిరంగులను డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లు పూర్తిచేసి గ్రూప్స్, సివిల్ సర్వీస్ ఉద్యోగాలు టార్గెట్‌గా చేసుకుని, సాధించే దిశగా చదువులు కొనసాగించాలని ఆకాంక్షించారు. వీరిద్దరూ జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన సందర్భంగా కళాశాలలోని అధ్యాపకులు సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు సత్కరిస్తూ కళాశాలలో పండగ వాతావరణం తలపించేలా సభ నిర్వహించారు.

బలిజిపేట: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మంచి విద్యను అభ్యసించాలని ఎంపీపీ నాగమణి కోరారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాల నుంచిజగనన్న ఆణిముత్యాలుకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మంచి విద్యను అభ్యసించి తల్లిదండ్రులు, గ్రామం, పాఠశాలకు మంచి పేరు, ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో బలిజిపేట మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. బలిజిపేట ఉన్నత పాఠశాలకు సంబంధించి పదవ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన ఎస్.ఉమామహేశ్వరి(581), కె,తిరుపతి(580), జి.జనని(561)లను, వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, జి.జగన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలుతో విద్యాభివృద్ధికి ప్రోత్సాహం

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మండలంలోని విద్యార్థులను ప్రోత్సహించడానికి దోహదపడుతుందని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.శ్రీరాములు అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో 2023వ విద్యాసంవత్సరంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు విద్యను ప్రోత్సహించిన పేరెంట్స్‌ను ప్రశంసాపత్రాలు,మెడల్స్‌తో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ జగన్నాథరావు ఆధ్వర్యంలో స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పదోతరగతి పరీక్షల్లో 555 మార్కులు సాధించిన చొక్కాపు భవాని, 553 మార్కులు సాధించిన ముప్పినేని పద్మిని, కటకాన రాజేశ్వరి, 525 మార్కులు సాధించిన మడే హోహన్,492 మార్కులు సాధించిన తోట కిరణ్మయిలను సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలి మాటలు కాదు.. దమ్ముంటే చర్చకు రావాలి

• ఎంపీపీ బడ్నాన ప్రమీల సవాల్


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ బడ్నాన ప్రమీల

పాచిపెంట: టీడీపీ మండల నాయకులు వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి జరగలేదని గాలి మాటలు మాట్లాడడం కాదని.. దమ్ముంటే మీడియా సాక్షిగా బహిరంగ చర్చకు రావాలని ఎంపీపీ బడ్నాన ప్రమీల సవాల్ విసిరారు. సోమవారం స్థానిక మండల పరిషత కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ, కొంతమంది టీడీపీ నాయకులు ఆదివారం తనపై విమర్శలు చేయడాన్ని ఖండించారు. సంధ్యారాణిని విమర్శించే అర్హత తనకు లేనప్పుడు ప్రజాక్షేత్రంలో ఒక్కసారి కూడా ఎమ్మెల్యేగా గెలవనటువంటి సంధ్యారాణికి 151 మంది ఎమ్మెల్యేలతో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పైనా, ఉపముఖ్యమంత్రి రాజన్నదొరపైన విమర్శలు చేసే అర్హత ఉందా అని ప్రశ్నించారు. తనకు రాజకీయ అనుభవం లేకపోయినా, రాజకీయాల పట్ల అవగాహన ఉందన్నారు. సంధ్యారాణి ప్రకటించిన వ్యక్తి పాచిపెంట మండల పార్టీ అధ్యక్షుడు అయితే.. టీడీపీ ఉత్తరాంధ్ర బస్సు యాత్రకు సంబంధించి టీడీపీ అధిష్టానం పంపించిన లిస్టులో వేరే వ్యక్తి పేరు ఎందుకు ఉందన్నారు. సంధ్యారాణికి టికెట్ రాదన్న విషయం టీడీపీకి చెందిన కొంతమంది సీనియర్ నాయకులే పాచిపెంట నడి బజారులో చెబుతున్నారని.. అదే విషయాన్ని తాను ప్రెస్‌మీట్‌లో చెప్పానని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, పలువురు నాయకులున్నారు.

వేతనదారులు సమయపాలన పాటించాలి


వేతనదారుల మస్తరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: వర్షం కురవడంతో నేలలు చల్లబడ్డాయని ఉపాధిహామీ వేతనదారులు సమయ పాలన పాటించి నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనం గిట్టుబాటవుతుందని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పణుకుపేట చెలికాని చెరువులో వేతనదారుల పనులు పరిశీలించి మస్తర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంతవరకూ ఎండలు తీవ్రంగా ఉన్నందున, మట్టి పనులు చేయడానికి ప్రతికూల వాతావరణం ఉందన్నారు. తాజాగా వర్షం కురవడం వల్ల మట్టి పనులు చేయడానికి వీలైందని తెలియజేశారు. అర్హులైన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని, పనుల్లో పాల్గొన్న వారికి మాత్రమే మస్తరు వేయాలని వేసిన మస్తరును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.పద్మావతి, ఉపాధి పనుల టెక్నికల్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


వెంకటభైరిపురంలో విద్యార్థులకు మెడల్స్ అందిస్తున్న సర్పంచ్ వెంకటరత్నం

మక్కువ: మండలంలోని వెంకటభైరిపురం, ములక్కాయవలస మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం సత్కరించారు. వెంకటభైరిపురం పాఠశాలకు చెందిన గవర ఈశ్వరరావు, పొట్నూరు భార్గవి, తాడి సౌజన్యలు ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరచడంతో నగదు ప్రోత్సాహకాలు అందించారు. అలాగే మోడల్ పాఠశాలలో పదో తరగతిలో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ స్వర్ణలత చేతులమీదుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ.పద్మావతి, పాఠశాల కమిటీ చైర్మన్ జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఆర్.శంకరరావు, మఠ్రాపు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన స్పందనకు 70 వినతులు


వినతులు స్వీకరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరిజన స్పందనకు 70 వినతులు వచ్చాయి. తమ భూములు కొంతమంది ఆక్రమించుకున్నారని పూనుపేట గిరిజనులతో పాటు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు వాబయోగి ఫిర్యాదు చేశారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు. మనుమకొండకు చెందిన రేఖ సీఆర్‌టీ పోస్టు ఇప్పించాలని, రింపికి చెందిన చంద్రశేఖర్ ఆటో కొనుగోలుకు రుణం మంజూరు చేయాలని, భామినికి చెందిన భారతి హెల్త్ వర్కర్ పోస్టు ఇప్పించాలని కోరుతూ వినతులు అందజేశారు. వీటితో పాటు పలు వినతులు అందాయి. కార్యక్రమంలో ఏపీఓ రోసిరెడ్డి, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, ఉపసంచాలకులు శ్రీనివాసరావు, ఏఎంఓ కోటిబాబు, పీఏఓ హరికృష్ణ, సీడీపీఓలు రంగలక్ష్మి, విమలారాణి, హెచ్‌ఓలు అమరేశ్వరి, ఆయంతి, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

మక్కువ: మండలంలోని అన్ని పంచాయతీల్లో జరుపుతున్న జగనన్న కాలనీ నిర్మాణ పనులు వేగవంతంగా జరిపించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు. సోమవరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న కాలనీ నిర్మాణాలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. అధికారులు అలసత్వం వహించకుండా ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిపేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఏ.సింహాచలం, వెలుగు ఏపీఎం సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం

కురుపాం: కురుపాం పంచాయతీ పరిధి టేకరఖండి గిరిజన గ్రామ సమీపంలో జరుగుతున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిపై అక్కడ ఉన్న సిబ్బంది వద్ద ఆరాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన యువతకు మెరుగైన ఉన్నత విద్యను అందించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి రూ.153 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో సుమారు 105 ఎకరాల్లో కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని తెలిపారు. ఆమె వెంట ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, స్థానిక సర్పంచ్ గార్ల సుజాత, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్, మండల కన్వీనర్ ఇంటి కుప్పల గౌరీశంకరరావు, శెట్టి నాగేశ్వరరావు, అంధవరపు కోటేశ్వరరావు, షేక్ నూర్జెల్ల, తదితరులు ఉన్నారు.

రథయాత్ర ఏర్పాట్లు పూర్తి


వీరఘట్టం: యాత్రకు ముస్తాబైన రథం


పాలకొండ: ఆలయంలో పూజలు చేస్తున్న డీసీ సుజాత

పాలకొండ: జగన్నథస్వామి రథయాత్ర ఉత్సవాలను సక్రమంగా నిర్వహించాలని దేవాదాయశాఖ డీసీ సుజాత సూచించారు. సోమవారం స్థానిక జగన్నాథస్వామి ఆలయాన్ని ఆమె సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథయాత్ర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ ఈఓ వి.రాధాకృష్ణకు సూచించారు. రథాన్ని పరిశీలించి అలంకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు.

• వీరఘట్టం: మండల కేంద్రంలో ఏటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవాలను ఈ ఏడాది కూడా వైభవంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 నుంచి 28 వరకు ఉత్సవాలు జరగనున్నాయని దేవాదాయశాఖ ఈఓ వి.రాధాకృష్ణ, అర్చకులు లింగరాజ్‌రథో తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక మందిరం వీధిలో వెలసిన జగన్నాథస్వామి ఆలయాన్ని సోమవారం సంప్రోక్షణ చేశారు. అనంతరం స్వామి వారికి నేత్రోత్సవం నిర్వహించారు. మంగళవారం స్వామి రథయాత్ర ప్రారంభం అవుతుందని అర్చకులు తెలిపారు. 24న హిరాపంచమి అనంతరం 28న మారు రథయాత్ర జరుగుతుంది.